సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

సోమవారం ǀ 12 ǀ ఫిబ్రవరి ǀ 2024



సందడే సందడి...

మాఘ మాసం ప్రారంభం కావటంతో శుభ ఘడియలు వచ్చేశాయి. 14, 15, 17, 18, 19 తేదీల్లో పెళ్లిళ్లు ఎక్కువగా ఉన్నాయి. 8లో



అగ్నిప్రమాదాలను అడ్డుకునేలా..

వేసవిలో అటవీ ప్రాంతంలో అగ్నిప్రమాదాలు జరగకుండా ముందస్తుగా అధికారులు ఫైర్‌లైన్స్ ఏర్పాటు చేస్తున్నారు. 10లో

గరిష్టం / కనిష్టం

33° / 19°

వాతావరణం

జిల్లాలో సోమవారం సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతాయి. ఆకాశంలో మేఘాలు అలుముకుంటాయి.

న్యూస్‌రీల్

భద్రగిరి రామయ్యకు అధిక ఆదాయం

భద్రాచలంఅర్బన్: భద్రాచలం శ్రీసీతారామ చంద్ర స్వామి దేవస్థానానికి గత జనవరి నెలలో అధిక ఆదాయం లభించింది. ఈఓ రమాదేవి ఆదివారం వివరాలు వెల్లడించారు. ఒక్క నెలలోనే రికార్డు స్థాయిలో రూ.5,80,19,260 ఆదాయం వచ్చింది. దుకాణాల, స్థలం, లైసెన్స్ లీజు ద్వారా రూ.20,59,877.12, వసతి సదుపాయం ద్వారా రూ.27,54,068, హుండీ ద్వారా రూ.1,66,91,948, ప్రసాదాల అమ్మకాల ద్వారా రూ.1,63,52,270, ప్రచారశాఖ ద్వారా రూ.7,06,481, ఇతర అమ్మకాలు ద్వారా రూ.89,550, సేవల ద్వారా రూ.1,67,49,888, ఇంకా వివిధ రూపాల్లో రూ.7,42,740, అడ్వాన్స్‌లు, డిపాజిట్ల రికవరీ రూపంలో రూ.10,35,550, డొనేషన్ల రూపంలో రూ.7,66,116, ముక్కోటి ఉత్సవాల ద్వారా రూ.67,31,342 ఆదాయం లభించింది. ఆలయ ఈఓగా గతేడాది బాధ్యతలు చేపట్టిన రమాదేవి తీసుకున్న చర్యలు సత్ఫలితాలను ఇవ్వడంతో ఆదాయం పెరిగింది.

స్వామివారి సేవలో వనపర్తి ఎమ్మెల్యే

భద్రాచలంటౌన్ : శ్రీసీతారామచంద్ర స్వామి వారిని వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈఓ రమాదేవి, డీసీసీబీ డైరెక్టర్ తుళ్శూరి బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లికి విశేషపూజలు



అమ్మవారి సేవలో న్యాయమూర్తి సాయిశ్రీ

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లికి అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయానికి ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. క్యూలైన్ ద్వారా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అన్నప్రాసనలు, ఒడిబియ్యం, పసుపు, కుంకుమలు, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పూజాది కార్యక్రమాల్లో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మహిపతి రామలింగం, డైరెక్టర్లు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న మెజిస్ట్రేట్

శ్రీకనకదుర్గ అమ్మవారిని ఆదివారం జిల్లా జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కె.సాయిశ్రీ, పాల్వంచ తహశీల్దార్ నాగరాజు దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారికి అమ్మవారి శేషవస్త్ర ప్రసాదాలను అర్చకులు అందజేశారు.

ఘాటెక్కిన వెల్లుల్లి

నాలుగు రెట్లు పెరిగిన ధర



బూర్గంపాడు: ప్రస్తుత మార్కెట్‌లో వెల్లుల్లి ధరలు ఎన్నడూ లేనంత గరిష్ఠస్థాయికి చేరాయి. నిత్యం కూరలలో వాడుకునే వెల్లుల్లిని సామాన్యుడు కొనలేని పరిస్థితి నెలకొంది. వెజ్, నాన్ వెజ్ వంటలలో వెల్లుల్లి తప్పనిసరిగా ఉండాల్సిందే. ప్రస్తుతం చికెన్ ధరను మించి మటన్ ధరకు చేరువలోకి వెల్లుల్లి ధర సమీపిస్తోంది. ప్రతికూల వాతావరణ పరిస్థితులతో ఈ ఏడాది వెల్లుల్లి దిగుబడులు బాగా తగ్గాయి. దీంతో అంతర్జాతీయ మార్కెట్‌లో వెల్లుల్లికి విపరీతమైన డిమాండ్ ఏర్పడగా, రాష్ట్రంలో కూడా వెల్లుల్లి ధరలకు రెక్కలొచ్చాయి. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో వెల్లుల్లి ధర రూ.350 నుంచి రూ.400 వరకు పలుకుతోంది. నెలన్నర రోజుల క్రితం కిలో రూ.100 నుంచి రూ.150 పలికిన వెల్లుల్లి ధర అమాంతంగా నాలుగు రెట్లు పెరిగింది. ధరలు విపరీతంగా పెరుగుతుండటంతో వ్యాపారులు కూడా వెల్లుల్లిని బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని ధరలను తగ్గించాలని వినియోగదారులు కోరుతున్నారు.

క్రీడా సంబురాలను జయప్రదం చేయాలి

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులకు ఖేలో భద్రాద్రి పేరుతో నిర్వహించే క్రీడా సంబురాలను జయప్రదం చేయాలని తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎ.రామారావు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 15, 16, 17 తేదీల్లో ప్రకాశం స్టేడియంలో క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, టెన్నికాయిట్, అథ్లెటిక్స్ నిర్వహిస్తున్నట్లు వివరించారు.

ఎన్నికల బదిలీలు షురూ



కలెక్టరేట్ సముదాయం

తహసీల్దార్లు, ఎంపీడీఓలు, పోలీస్ అధికారులకు స్థాన చలనం

- రెండు రోజుల్లో జిల్లాస్థాయి అధికారుల బదిలీ!
- పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో చర్యలు

చుంచుపల్లి: జిల్లాలో పార్లమెంట్ ఎన్నికల హడావుడి మొదలైంది. ఈ నేపథ్యంలోనే అధికారుల బదిలీల ప్రక్రియ వేగవంతంగా చేపడుతున్నారు. గతేడాది డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు భారీగా అధికారులను బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు లోక్‌సభ ఎన్నికల సందర్భంగా కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సొంత జిల్లాలో ఈ ఏడాది జూన్ 30 నాటికి మూడేళ్ల సర్వీసు పూర్తి చేయనున్న అధికారుల జాబితాలను శాఖల వారీగా రూపొందించి ఇటీవల ప్రభుత్వానికి పంపారు. ఈ క్రమంలోనే తొలుత శనివారం పాల్వంచ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌తో పాటు కొత్తగూడెం ఆర్డీఓ, ఎనిమిది మంది తహసీల్దార్లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆదివారం జిల్లా వ్యాప్తంగా 15 మంది ఎంపీడీఓలకు స్థానచలనం కల్పించారు. పోలీస్ శాఖ అధికారులను కూడా బదిలీ చేశారు. పలువురు అధికారులను వివిధ జిల్లాలకు బదిలీపై పంపించారు. మరో నాలుగైదు రోజుల్లో జిల్లా స్థాయిలో పనిచేస్తున్న అధికారులను సైతం బదిలీ చేయనున్నారనే చర్చ జరుగుతోంది. బదిలీల ప్రక్రియను ఈనెల 15 వరకు పూర్తి చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలను జారీ చేసింది. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో సుమారు 70 మంది అధికారులకు స్థానచలనం కలిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఇందులో 20 మంది వరకు జిల్లా స్థాయిలో వివిధ శాఖల్లో పని చేస్తున్న అధికారులు ఉన్నట్లు తెలిసింది. ఈసారి ఎన్నికలతో సంబంధం లేని పంచాయతీరాజ్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖల వివరాలను సైతం కోరడంతో, ఆ రెండు శాఖల్లోనూ భారీగా బదిలీలు జరిగే అవకాశం ఉంది. జిల్లా పంచాయతీ అధికారితో సహా డీఎల్‌పీఓలు, డీఆర్డీఓ, జిల్లా పరిషత్ పరిధిలో జెడ్పీ సీఈఓ, డిప్యూటీ సీఈఓ, ఎంపీడీవోలు, ఎంఈఓల సమాచారాన్ని సైతం తీసుకున్నారు. పంచాయతీరాజ్ శాఖలో మూడేళ్ల కాలం పూర్తి చేసిన వారి సంఖ్య ఎక్కువగానే ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో ఆ శాఖలో పనిచేస్తున్న అధికారుల్లో కొంత కలవరం మొదలైంది. కొందరు అధికారులు ఇప్పటికే తమను ఎన్నికల బదిలీల నుంచి మినహాయించాలని విన్నవించుకున్నారు. కాగా జిల్లాలో ఆదివారం పలువురు సీఐలు, ఎస్‌ఐలను బదిలీ చేశారు.

పార్లమెంట్ ఎన్నికలకు కసరత్తు

వచ్చే పార్లమెంట్ ఎన్నికలను జిల్లాలో ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారుల బదిలీ చేపడుతున్నట్లు తెలిసింది. ఒకే చోట మూడేళ్లుగా పనిచేస్తున్న వారితో పాటు సొంత జిల్లాలో పనిచేస్తున్న వారిని వేరేచోటకు స్థానచలనం కలిగించేలా చర్యలు చేపట్టారు. ఎన్నికలతో ప్రత్యక్ష సంబంధం కలిగిన రెవెన్యూ, పోలీసు వర్గాల సమాచారాన్ని ముందుగా సేకరించి బదిలీల ప్రక్రియ చేపడుతున్నారు. త్వరలో పార్లమెంట్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఇప్పటికే అధికారులు కసరత్తు చేస్తున్నారు. పోలింగ్ కేంద్రాల గుర్తింపు, వసతుల ఏర్పాట్లపై దృష్టి సారించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పూర్తి చేశారు. జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారికి ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం కల్పించడంతో జిల్లాలో ఈసారి భారీగా ఓటు హక్కు కోసం కొత్తగా దరఖాస్తు చేసుకున్నారు. జిల్లాలో తుది ఓటరు జాబితాను ఈ నెల 8న కలెక్టర్ ప్రియాంక ఆల ప్రకటించగా, 9,84,906 మంది ఓటర్లు ఉన్నట్లు తేలింది. ఇక రెవెన్యూ అధికారులు ఇప్పటికే ఈవీఎంలను సిద్ధం చేసే పనిలో ఉన్నారు.

15 మంది ఎంపీడీఓలు బదిలీ

చుంచుపల్లి: జిల్లాలో పలువురు ఎంపీడీఓలను ఆదివారం బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. జిల్లాలోని 21 మండలాల పరిధిలో ఎంపీడీఓలు పనిచేస్తుండగా, వారిలో 15 మందికి స్థానచలనం కల్పించారు. వీరిని మహబూబాబాద్, ఖమ్మం, జనగామ జిల్లాలకు బదిలీ చేశారు. మహబూబాబాద్, ఖమ్మం, వరంగల్ జిల్లాల నుంచి పలువురు ఎంపీడీఓలను బదిలీల్లో భాగంగా జిల్లాకు కేటాయించారు. ఎన్నికల సంఘం సూచనల మేరకు సొంత జిల్లాలో పనిచేస్తూ మూడేళ్ల పదవీకాలం పూర్తిచేసిన అధికారులను బదిలీ చేశారు.

సంధి దిశగా..!



కొత్తగూడెం మున్సిపల్ కార్యాలయం

- ఇరువర్గాల కలిపేందుకు బీఆర్ఎస్ నేతల విశ్వప్రయత్నం
- అసమ్మతి కౌన్సిలర్లతో పార్టీ ముఖ్య నాయకుల సమావేశాలు
- కొత్తగూడెం మున్సిపాలిటీలో అవిశ్వాస అయోమయం

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపాలిటీలో పాలకవర్గం ఎన్నికైనప్పటి నుంచి మూడు వర్గాలుగా విభజింపబడి పాలన కొనసాగించారు. ఇప్పుడు మూడు నుంచి రెండు వర్గాలుగా ఏర్పడి చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టేందుకు సిద్ధమయ్యారు. అయితే ఇరువర్గాల కౌన్సిలర్లు సంధి దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. కౌన్సిల్ సభ్యులంతా కూడా స్వలాభం చూసుకుంటున్నారే తప్ప, ప్రజలకు సౌకర్యాల కల్పన, పట్టణాభివృద్ధి దిశగా కృషి చేయడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక్కడ కూడా ఇల్లెందు మున్సిపాలిటీ తరహాలో అవిశ్వాసం వీగిపోయే అవకాశం ఉన్నట్లు కనిపిస్తోంది. జనవరి 23న బీఆర్ఎస్ అసమ్మతి కౌన్సిలర్లు, ఇండిపెండెంట్, కాంగ్రెస్ కౌన్సిలర్లు 22 మంది కలిసి అవిశ్వాస తీర్మానం కాపీని కలెక్టర్‌కు అందజేశారు. ఈ క్రమంలో కలెక్టర్ ఈ నెల 3న అవిశ్వాసంపై నోటీసులు జారీ చేసి, 19న బలపరీక్ష నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. అవిశ్వాస తీర్మానం కాపీని కలెక్టర్‌కు అందజేసిన రోజు నుంచే సంతకాలు చేసిన వారిలో చాలా మంది కౌన్సిలర్లు తనతో టచ్‌లో ఉన్నారని, వారంతా ఒత్తిడితోనే కలెక్టరేట్ వరకు వెళ్లి సంతకాలు చేశారని మున్సిపల్ చైర్‌పర్సన్ వ్యాఖ్యానించారు. ఆమె పేర్కొన్నట్లే పలువురు అసమ్మతి కౌన్సిలర్లు చైర్‌పర్సన్ వర్గంతో తిరుగుతున్నారు.

బీఆర్ఎస్ కీలక నేతలతో రహస్య భేటీ!

కొత్తగూడెం మున్సిపాలిటీలో మొత్తం 36 మంది కౌన్సిలర్లు ఉండగా, అందులో 22 మంది కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానంపై సంతకాలు చేశారు. మిగిలిన 14 మంది కూడా చైర్‌పర్సన్ వెంట ఉన్నారు. బలపరీక్ష జరిగే సమయంలో 36 మంది కౌన్సిలర్లలో మూడో వంతు కౌన్సిలర్లు మద్దతు తెలిపితే అవిశ్వాసం నెగ్గుతుంది. అయితే మొత్తం కౌన్సిలర్లలో మూడో వంతు కౌన్సిలర్లు తమ వెంటే ఉన్నారని ఇరువర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. అవిశ్వాసం వీగిపోయేలా బీఆర్ఎస్ ముఖ్య నాయకులు ఇరువర్గాలతో రహస్య సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. మంతనాలు ఫలిస్తే 19న బలపరీక్ష జరగకపోవచ్చు. అసమ్మతివర్గం డిమాండ్లు నెరవేరకపోతే బలపరీక్ష జరిగే అవకాశం ఉంటుంది. అయితే మున్సిపల్ ఎన్నికలు జరిగే వరకు ఇరువర్గాలకు ప్రయోజనం కలిగేలా సంధి చర్చలు చేస్తున్నట్లు సమాచారం. పాలకవర్గ సభ్యులు రెండు వర్గాలుగా వీడిపోయి ఉండటంతో మున్సిపాలిటీలో అయోమయం నెలకొంది. ఇదే అదునుగా అధికారులు కార్యాలయంలో పని చేసే సిబ్బందికే నామినేటెడ్ కింద వివిధ అభివృద్ధి పనులను కట్టబెడుతూ నిధులను పంచుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. పాలకవర్గ సభ్యులు అసమ్మతిని వీడి ప్రజలకు సదుపాయాలు కల్పించేలా, పట్టణం అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకోవాలని పుర ప్రజలు కోరుతున్నారు. అధికారులు అభివృద్ధిపై దృష్టి పెట్టేలా జిల్లా, డీఎంఏ ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని పేర్కొంటున్నారు.

పరీక్షలంటే భయం వీడాలి



మాట్లాడుతున్న జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి ఇందిర

కొత్తగూడెంఅర్బన్: పరీక్షలంటే భయం వీడాలని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి ఇ.ఇందిర సూచించారు. ఆదివారం పాత కొత్తగూడెం విద్యార్థులకు ప్రేరణ శిక్షణ తరగతులను ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదో తరగతి ఫలితాల్లో బీసీ వసతి గృహ విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఒత్తిడికి గురికాకుండా ఆల్ ఇన్ వన్ లాంటి స్టడీ మెటీరియల్ చదవాలని చెప్పారు. డీసీఓ బాలరాణి, అధికారులు అపర్ణ, హిమాంత్, నర్సింహరావు, సరస్వతి, కౌసల్య, అరుణ, రవి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష



పరీక్ష కేంద్రంలో పరిశీలిస్తున్న ఆర్‌సీఓ ప్రత్యూష

పాల్వంచరూరల్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 2024–2025 సంవత్సరానికి ఐదో తరగతిలో ప్రవేశానికి ఆదివారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా జరిగింది. జిల్లాలో 10 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించగా, ఆర్‌సీఓ కె.ప్రత్యూష పర్యవేక్షించారు. 1,783 మంది బాలురకు 1,638 మంది హాజరు కాగా 144 మంది గైర్హాజరయ్యారు. 1,852 మంది బాలికలకుగాను 1,702 మంది హాజరుకాగా 151 మంది గైర్హాజరయ్యారు. మొత్తం 296 మంది గైర్హాజరైనట్లు ఆర్‌సీఓ తెలిపారు.

ఆక్సిజన్–18 ఉత్పత్తి గర్వకారణం

భారజల బోర్డు చైర్మన్ అండ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ సత్యకుమార్

అశ్వాపురం: దేశంలోనే తొలిసారిగా మణుగూరు భారజల కర్మాగారంలో ఆక్సిజన్–18 ఎన్‌రిచ్‌డ్ వాటర్ ఉత్పత్తి చేయడం గర్వకారణమని భారజల బోర్డు చైర్మన్ అండ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఎస్.సత్యకుమార్ అన్నారు. భారజల కర్మాగారాన్ని భారజల బోర్డు చైర్మన్ అండ్ సీఈ సత్యకుమార్, కేంద్ర ప్రభుత్వ ఆర్థిక శాఖ కార్యదర్శి సీమాశర్మజైన్ ఆదివారం సందర్శించారు. పలు విభాగాలను, ఆక్సిజన్–18 ప్లాంటును పరిశీలించారు. అనంతరం కర్మాగారం పరిపాలన భవనంలో జీఎం, అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సత్యకుమార్ మాట్లాడుతూ భారత అణుశక్తి విభాగంలో మణుగూరు భారజల కర్మాగారం ఉత్పత్తి, ఎగుమతులలో అగ్ర స్థానంలో ఉందని అన్నారు. ఆక్సిజన్–18 ఉత్పత్తితో మణుగూరుకు దేశంలోనే ప్రత్యేక గుర్తింపు వచ్చిందని అన్నారు. భారజలం ఉత్పత్తి ద్వారా సైన్స్ అండ్ టెక్నాలజీ, పరిశ్రమలను అభివృద్ధి చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో భారజల కర్మాగారం జీఎం జగ్గారావు, డీజీఎంలు హెచ్‌కే.శర్మ, శ్రీనివాసరావు, విశ్వనాథ్, సీఏఓ వేణు, ఐఆర్‌ఓ లత, అధికారులు, ఉద్యోగ సంఘం అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్



రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్

కొత్తగూడెంటౌన్: క్రీడలు మానసికోల్లాసానికి దోహదం చేస్తాయని కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ పేర్కొన్నారు. ఆదివారం కొత్తగూడెం రామవరం పరిధిలోని నాగయ్యగడ్డ బస్తీలో ఉన్న సాధన గ్రౌండ్‌లో రాజేందర్ సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రవీణ్ మెమోరియల్ రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నీ ప్రారంభమైంది. కొత్తగూడెం డీఎస్పీ బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవాలని సూచించారు. గెలుపు ఓటములు సహజమని, గెలిచినవారు ఇంకా శ్రమించి, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, ఓడినవారు మరింత పట్టుదలతో గెలుపు దిశగా అడుగులు వేయాలని చెప్పారు. క్రికెట్ పోటీల విజయవంతానికి నిర్వాహకులు చేస్తున్న కృషిని డీఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం వన్‌టౌన్, టూటౌన్ సీఐలు ఎం.కరుణాకర్, రమేష్‌కుమార్, బీఎస్పీ పార్లమెంటరీ జోనల్ ఇన్‌చార్జ్ యెర్రా కామేష్, మోరే భాస్కర్, మోరే రమేష్, సాయి, శరత్, నున్న శివ, లింగేష్, బంటు నరేందర్, యెర్రా నాగేందర్, ధనుంజయ్, యెర్రా శ్రీనివాస్, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

భావ ప్రకటనా స్వేచ్ఛకు సంకెళ్లు

- సత్యాలు చెబితే దాడులు
- ప్రాథమిక హక్కులూ హరిస్తున్నారు
- ప్ర.ర.వే. మహాసభల్లో వక్తల ఆందోళన



మాట్లాడుతున్న కవి, రచయిత అరుణ గోగుల్

ఖమ్మంగాంధీచౌక్ : సమాజంలో స్త్రీలకు భావ ప్రకటనా స్వేచ్ఛను అణచివేస్తున్నారని ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక(ప్ర.ర.వే.) మహాసభల్లో పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. ఖమ్మంలోని నంబూరి పరిపూర్ణ ప్రాంగణంలో రెండు రోజులుగా సాగుతున్న మహాసభల్లో ఆదివారం 'స్త్రీలపై ట్రోలింగ్' అనుభవాలపై చర్చించారు. హైకోర్టు న్యాయవాది స్వేచ్ఛా మాట్లాడుతూ.. సమాజంలో మహిళలను భిన్నంగా చూస్తూ వారి భావజాలంపై దాడులు చేస్తున్నారని అన్నారు. మహిళలను తెలివిగా ఎదుర్కోలేక 'ట్రోలింగ్' చేస్తున్నారని చెప్పారు. వ్యక్తిగత దాడులు కూడా జరుగుతున్నందున యూరప్ తరహాలో డిజిటల్ సర్వీస్ యాక్టు రావాలని అన్నారు. రచయిత్రి కేఎన్ మల్లీశ్వరి మాట్లాడుతూ.. సమాజంలో జరుగుతున్న అంశాలపై పుస్తకాలు రాస్తే సోషల్ మీడియాలో దారుణమైన విమర్శలు చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. మిత్రులుగా భావించే వారు కూడా అలా చేయటం బాధేస్తుందని భావోద్వేగానికి లోనయ్యారు. సాహితీవేత్త అరుణ గోగుల్ మండ మాట్లాడుతూ.. పెళ్లి పేరుతో మహిళను అణిచి వేస్తున్నారన్నారు. మహిళలకు ప్రాథమిక హక్కులు కూడా లేకుండా పోతున్నాయని, కుటుంబీకులు కూడా మహిళను పరాయిగా చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్ట్ తులసీచంద్ మాట్లాడుతూ.. నగ్న సత్యాలు చెబితే సమాజానికి నచ్చడం లేదన్నారు. ఫేస్ బుక్‌లలో వచ్చే విమర్శలను తట్టుకోలేక మహిళలు ఆ ఫేస్‌బుక్‌ల నుంచి తప్పుకుంటున్నారని అన్నారు. నాస్తికుడు బైరి నరేష్ మాట్లాడుతూ.. ప్రతీ రచన సమస్యలకు పరిష్కారంగా ఉండాలన్నారు. పుస్తకాలు రాయడంతో పాటు వీడియోలు కూడా చేయాలన్నారు. తమ రచనలతో ఎదురవుతున్న సమస్యలను అధిగమించాలే తప్ప మౌనంగా ఉండరాదని సూచించారు.

ట్రోలింగ్ ఆయుధంగా దాడులు: చక్రపాణి

ప్ర.ర.వే. మహాసభల ముగింపు కార్యక్రమంలో ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి మాట్లాడుతూ.. ఆన్‌లైన్ వేదికల్లో మాట్లాడే వారిని సోషల్ మీడియా భయభ్రాంతులకు గురి చేస్తోందన్నారు. ట్రోలింగ్‌ను ఒక ఆయుధంగా వాడుకుంటూ నోరు మూయించేలా వినియోగిస్తున్నారని అన్నారు. విమలక్క మాట్లాడుతూ.. ట్రోలింగ్‌ను ఎలా ఎదుర్కోవాలో వివరించారు. కేంద్రసాహిత్య అకాడమీ సభ్యులు ప్రసేన్ మాట్లాడుతూ.. అంతా కలిసికట్టుగా ట్రోలింగ్ చేసే వారిని ఎదుర్కోవలసిన అవసరం ఉందన్నారు. నటి, యాంకర్, రచయిత్రి ఉదయ భాను మాట్లాడుతూ.. మహిళలపై జరుగుతున్న అసభ్యకర ట్రోలింగ్‌కు వ్యతిరేకంగా ప్ర.ర.వే. చేస్తున్న పోరాటాన్ని ప్రశంసించారు. అంతకు ముందు శీలా సుభద్రాదేవి అధ్యక్షతన కాత్యాయనీ విద్మహే రాసిన 'నారిసారించిన నవల' అనే గ్రంథాన్ని కవి శిలాలోలిత ఆవిష్కరించారు. కె విమల పుస్తక పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు అనిశెట్టి రజిత, మానస ఎండ్లూరి, రామలక్ష్మి, అమరజ్యోతి, దేవకీదేవి పాల్గొన్నారు.

అందరికీ సమాన విద్య అందాలి

- ఉపాధ్యాయులు బోధనా పద్ధతులను అప్‌డేట్ చేసుకోవాలి
- ప్రపంచబ్యాంక్ కనుసన్నల్లో బడ్జెట్ రూపొందించారు
- అఖిల భారత విద్యాహక్కు వేదిక అధ్యక్షుడు జగ్ మోహన్ సింగ్
- ఖమ్మంలో టీపీటీఎఫ్ మహాసభలు ప్రారంభం



నగరంలో ప్రదర్శన నిర్వహిస్తున్న టీపీటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

ఖమ్మం సహకారనగర్ : అన్ని వర్గాల వారికి సమాన విద్య అందించేందుకు నిరంతరం పోరాడాలని అఖిల భారత విద్యా హక్కు వేదిక అధ్యక్షులు ప్రొఫెసర్ జగ్‌మోహన్ సింగ్ అన్నారు. ఖమ్మంలోని నయాబజార్ పాఠశాలలో ఆదివారం ప్రారంభమైన టీపీటీఎఫ్ రాష్ట్ర ద్వితీయ విద్యా, వైజ్ఞానిక మహాసభలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రేపటి తరాలకు నూతన ఉపాధి అవకాశాలను కల్పించేలా ఉపాధ్యాయులు బోధనను అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించేందుకు వీలైనన్ని ఎక్కువ గ్రంథాలయాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎంతటి ఆధునిక సాంకేతిక విజ్ఞానమైనా ఉపాధ్యాయునికి ప్రత్యామ్నాయం కాదని, తరగతి గదిలో ఉపాధ్యాయుడే అంతిమ విధాన నిర్ణయకర్త అని అన్నారు. యువతలో అభ్యుదయ, శాస్త్రీయ ఆలోచనా విధానాలను పెంపొందించాలని సూచించారు. విజ్ఞాన శాస్త్రం పై విద్యార్థులకు అభ్యసనాసక్తి పెంపొందించాలని, ఈ దిశగా పాఠశాలలను ముందుకు నడిపించాలని కోరారు. ప్రతి విద్యార్థికీ తల్లి తొలి గురువు కావాలని, వారికి చదవడం అలవాటు చేయాలని అన్నారు. విద్యార్థులు చదువుకునేందుకు అవకాశమున్న మేరకు గ్రంథాలయాల ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇటీవల ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ ప్రపంచబ్యాంక్ కనుసన్నల్లో రూపొందించారని ఆయన ఆరోపించారు. అనంతరం డీఈఓ సోమశేఖర శర్మ పలు అంశాలపై మాట్లాడారు.

అంతరాలు లేని విద్యే లక్ష్యం..

అంతరాలు లేని విద్య అందరికీ అందాలనే నినాదంతో టీపీటీఎఫ్ నిరంతరం పోరాడుతుందని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.అశోక్ కుమార్ అన్నారు. రాష్ట్ర బడ్జెట్ రూ.2,75,891 కోట్లలో విద్యకు రూ.21,389 కోట్లు కేటాయించారని, మొత్తం బడ్జెట్‌లో అది 7.75 శాతమేనని తెలిపారు. విద్యారంగానికి 15 శాతం బడ్జెట్ కేటాయిస్తామని ఎన్నికల ముందు కాంగ్రెస్ మేనిఫెస్టోలో ప్రకటించినా.. ఇప్పుడు అందులో సగమే కేటాయించిందని అన్నారు. 26 వేల ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల ప్రస్తావన లేకుండా రాబోయే ఇంటర్నేషనల్ స్కూళ్లకు రూ.500 కోట్లు కేటాయించడం శోచనీయమన్నారు. ఉపాధ్యాయుల ప్రధాన సమస్యలైన 317 జీఓ, కామన్ సర్వీస్ రూల్స్, టెంపరరీ, కాంట్రాక్ట్ తదితర వెట్టిచాకిరీ విధానాలను రద్దు చేసి ఉపాధ్యాయ ఖాళీల నియామకాలకు నోటిఫికేషన్లు ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ పూర్వ అధ్యక్షులు కె.వేణుగోపాల్ మాట్లాడుతూ రాజ్యాంగ విలువలను కాలరాసేందుకు ముందుకొచ్చిన నూతన విద్యా ముసాయిదాను వ్యతిరేకించాలని కోరారు. గత ఉద్యమ స్ఫూర్తితో పోరాటాలను ముందుకు తీసుకెళ్లాలని మరో పూర్వ అధ్యక్షుడు రాములు సూచించారు. మహాసభల్లో టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. నాగిరెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏ.వీ. నాగేశ్వరరావు, ఎస్.విజయ్ పాల్గొన్నారు.

సామాజిక దృక్పథంతో పనిచేయాలి

అందరికీ సమానమైన విద్యను అందించాలని, ఉపాధ్యాయులు సామాజిక దృక్పథంతో పని చేయాలని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య అన్నారు. టీపీటీఎఫ్ రాష్ట్ర విద్యా, వైజ్ఞానిక మహాసభలకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ప్రజల్లో సామాజికంగా, రాజకీయంగా వస్తున్న మార్పులను వివరించారు. పోరాటాల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య గౌరవాధ్యక్షురాలు విమలక్క మాట్లాడుతూ.. మహిళలు చైతన్యవంతం కావాలని, మహిళా ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలని సూచించారు. మొదట నగరంలో ఉపాధ్యాయులు నిర్వహించిన భారీ ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది.

క్లుప్తంగా

కమర్తపు మురళి బాధ్యతల స్వీకరణ



ప్రమాణస్వీకారం చేసిన కమర్తపు మురళితో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగరం 24వ డివిజన్ కార్పొరేటర్ కమర్తపు మురళి తెలంగాణ పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఆదివారం హైదరాబాద్‌లోని నారాయణగూడలో గల పద్మశాలి భవన్‌లో ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో భారత పద్మశాలి సంఘం అధ్యక్షుడు కందగట్ల స్వామి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం జగన్నాథం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాచర్ల రామచందర్, అఖిల భారత పద్మశాలి యువజన విభాగం జాతీయ ఇన్‌చార్జ్ అవ్వారి భాస్కర్, మహిళ విభాగం అధ్యక్షురాలు వనం దుష్యంతల, పుట్ట పాండురంగయ్య, మెతుకు సత్యం, అంబటి శ్రీనివాస్, గుంటుక రూప తదితరులు పాల్గొన్నారు.

క్వారీల్లో అధికారుల తనిఖీ



తోగ్గూడెంలో క్వారీని పరిశీలిస్తున్న అధికారులు

పాల్వంచరూరల్: అక్రమంగా ఖనిజ తవ్వకాలు, రవాణాను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్పెషల్ డ్రైవ్ చేపట్టింది. ఈక్రమంలో ఆదివారం మండల పరిధిలోని తోగ్గూడెంలోని క్వారీలను మైనింగ్, రెవెన్యూ, పోలీసు అధికారులు తనిఖీ చేశారు. క్వారీల నుంచి అక్రమ రవాణా జరగకుండా కందకాలు తవ్వించారు. క్వారీలు అక్రమంగా నడిపినా, ఖనిజాన్ని రవాణా చేసినా చర్యలు తీసుకుంటామని మైనింగ్ జిల్లా అధికారి జైసింగ్ పేర్కొన్నారు. తనిఖీలో ఎస్‌ఐ.బి.శ్రీనివాస్, ఆర్‌ఐ.హచ్యా పాల్గొన్నారు.

శునకమెత్తు బంగారం



శునకాన్ని తూకం వేస్తున్న యజమానులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్మిక ప్రాంతమైన రుద్రంపూర్‌లో కాసిన నగేష్, స్వప్న దంపతులు ఓ శునకాన్ని పెంచుకుంటున్నారు. ఆదివారం శునకం నిలువెత్తు బంగారం(బెల్లం) కొలిచి సమ్మక్క, సారలమ్మలకు సమర్పించారు.

ముగిసిన అశోక్‌రెడ్డి అంత్యక్రియలు

బూర్గంపాడు: ఓ పెయింట్ కంపెనీ ఆధ్వర్యంలో దుబాయ్ టూర్‌కు వెళ్లి అక్కడ ఓ హోటల్‌లో గుండెపోటుతో మృతిచెందిన ఆవుల అశోక్ రెడ్డి మృతదేహాన్ని ఆదివారం స్వగ్రామం లక్ష్మీపురానికి తీసుకువచ్చారు. గత మంగళవారం రాత్రి అశోక్‌రెడ్డి దుబాయ్‌లోని ఓ హోటల్‌లో గుండెపోటుతో మృతిచెందాడు. మృతదేహాన్ని ఆరు రోజుల తర్వాత స్వగ్రామానికి తీసుకువచ్చారు. భార్య కోటేశ్వరి, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఆదివారం సాయంత్రం బంధు మిత్రుల రోదనల మధ్య అశోక్‌రెడ్డికి అంత్యక్రియలు పూర్తిచేశారు.

పందెంరాయుళ్ల అరెస్ట్

పాల్వంచరూరల్: అటవీప్రాంతంలో రహస్యంగా నిర్వహిస్తున్న కోడి పందేల స్థావరంపై ఆదివారం పోలీసులు దాడిచేశారు. ఎస్‌ఐ.బి.శ్రీనివాస్ కథనం ప్రకారం.. మండల పరిధిలోని చంద్రాలగూడెం గ్రామపంచాయతీ తుమ్మలగూడెం గ్రామ శివారు అటవీ ప్రాంతంలో కోడి పందేలు ఆడుతుండగా పోలీసులు దాడి చేశారు. 16 మంది పందెంరాయుళ్లను అరెస్ట్ చేశారు. రూ.5,500 నగదు, 8 కోళ్లు, 4సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.


దమ్మపేటలో...

దమ్మపేట: మండలంలోని కొమ్ముగూడెం గ్రామ శివారులో కోడి పందేలు నిర్వహిస్తున్న వ్యక్తులపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. ఎస్సై సాయికిషోర్‌రెడ్డి సిబ్బందితో కలసి దాడి చేసి, ఆరుగురు పందెం రాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. మూడు కోడి పుంజులు, రూ.4,680 నగదును స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు.

మిర్చి చోరీ

టేకులపల్లి: మండల పరిధిలోని తొమ్మిదో మైలు తండాలో శనివారం అర్ధరాత్రి కల్లంలో రాశి పోసిన మిర్చిని గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. సుమారు పది క్వింటాళ్ల మిర్చిని చోరీ చేశారని, రూ. 2 లక్షల నష్టం వాటిల్లిందని బాధిత రైతు గుగులోత్‌రామచందర్ ఆవేదన వ్యక్తం చేశాడు. తనకు న్యాయం చేయాలని టేకులపల్లి పోలీసులను ఆశ్రయించాడు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,595

సందడే సందడి...





ఖమ్మంలోని ఓ కల్యాణ మండపం

శుభ ఘడియలు తీసుకొచ్చిన మాఘమాసం

- వివాహాలకు ఈనెలలో పలు ముహూర్తాలు
- ముందస్తుగా ఫంక్షన్ హాళ్ల బుకింగ్
- ఎక్కడ చూసినా పెళ్లి పనుల హడావుడే..

సత్తుపల్లిటౌన్/ఖమ్మం గాంధీచౌక్: మాఘ మాసం ప్రారంభం కావటంతో శుభఘడియలు వచ్చేశాయి. జనవరిలో శూన్యమాసం కావడంతో నెలరోజులు ముహూర్తాలకు బ్రేక్ పడింది. ఇప్పుడు శుభముహూర్తాలతో పెళ్లిళ్ల సీజన్ ప్రారంభమైంది. మంచి రోజులు ఎప్పుడొస్తాయా అని ఎదురుచూస్తున్న వారు పనుల్లో నిమగ్నమయ్యారు.

పెళ్లి పనుల్లో బిజీ..

పురోహితులతో పాటు పెళ్లి వేదికలు తయారు చేసేవారు, బ్యాండ్ వాయిద్యం వారు, ఫొటో, వీడియోగ్రాఫర్లు, వంట మాస్టర్లు, ఈవెంట్ల నిర్వాహకులు బిజీ అయిపోయారు. అలాగే, కిరాణం, బంగారం దుకాణాలతో పాటు పూలు, కూరగాయలకు మంచి గిరాకీ ఉంటుందని భావిస్తున్నారు. కాగా, ఉమ్మడి జిల్లాలో వందకుపైగా కల్యాణ మండపాలు ఉన్నాయి. ఖమ్మంలో 50, కొత్తగూడెంలో 15, సత్తుపల్లిలో 10 మండపాలు చొప్పున ఉండగా.. ఇవి కాక వైరా, మధిర, భద్రాచలం, అశ్వారావుపేట, వేంసూరు, పెనుబల్లి, తల్లాడ, కల్లూరు, ఇల్లెందుల్లోనూ సకల సౌకర్యాలు గల మండపాలు ఉన్నాయి. ఏసీ, నాన్ ఏసీలను బట్టి రోజుకు రూ.20 వేల నుంచి రూ.5 లక్షల వరకు వీటికి అద్దె ఉంటుంది. అయితే, చాలా మంది ముందుగానే బుక్ చేసుకోవడంతో మంచి ముహూర్తాలు ఉన్న రోజుల్లో మండపాలు ఖాళీ లేవనే సమాధానం వస్తోంది. దీంతో పలువురు ఇళ్ల వద్దే వివాహం జరిపించాలనే నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఇక మరికొందరు ఫంక్షన్ హాల్ అందుబాటులో ఉన్న రోజునే ముహూర్తం ఖరారు చేసుకుంటున్నట్లు చెబుతున్నారు.

వేసవిలో లేనట్లే..

సెలవుల రీత్యా సాధారణంగా వేసవిలో పెళ్లిళ్లు చేయాలని ఎక్కువ మంది భావిస్తారు. అయితే ఈసారి అందుకు అవకాశం లేకుండా పోయింది. వేసవిలో పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలకు సరైన ముహూర్తాలు లేవని పురోహితుల ద్వారా తెలిసింది. దీంతో ఏప్రిల్‌లోగా పెళ్లిళ్ల ప్రక్రియ పూర్తిచేసేందుకు యువతీ యువకుల తల్లిదండ్రులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

వరుసగా మూడు నెలలు...

ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలల్లో పెళ్లిళ్లు, గృహప్రవేశాలు, శంకుస్థాపనలు, శుభకార్యాలకు మంచి ముహూర్తాలు ఉన్నాయి. ఆదివారం (ఈనెల 11వ తేదీ) నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు శుభముహూర్తాలు ఉన్నాయని పండితులు చెబుతున్నారు. ఈనెల 14, 15, 17, 18, 19 తేదీల్లో పెళ్లిళ్లు, శుభకార్యాలు ఎక్కువగా ఉన్నాయి. దీంతో ఈ మూడునెలల కాలంలో వివాహ తంతు పూర్తయ్యేలా పలువురు పేరుబలం, నక్షత్రాలు చూసుకుని ముహూర్తాలు ఖరారు చేసుకున్నారని పురోహితులు తెలిపారు.

మెండుగా ముహూర్తాలు



మాఘ మాసంలో శుభ ముహూర్తాలు ప్రారంభమయ్యాయి. రానున్న నూతన సంవత్సరం ఉగాది వరకు వరుస ముహూర్తాలు ఉన్నాయి. ప్రస్తుత సీజన్‌లో శుభ కార్యాలు ఆశాజనకంగా ఉన్నాయి. ప్రస్తుతం పెద్దసంఖ్యలో వివాహ ముహూర్తాలు ఉన్నాయి. ఫిబ్రవరి, మార్చి నెలలు కూడా వివాహాలకు అనుకూల సమయం.

– నందుల సుబ్రమణ్య శర్మ, పురోహితులు, వరంగల్ క్రాస్ రోడ్, ఖమ్మం

సిద్ధం చేస్తున్నాం...



పెళ్లిళ్లకు ముందుగానే బుక్ చేసుకుంటున్నారు. జనవరిలో ముహూర్తాలు లేకపోవడంతో ఫంక్షన్‌హాళ్లు ఖాళీగా ఉన్నాయి. ఇప్పుడు శుభఘడియలు ఉండటంతో బుకింగ్‌లు వస్తున్నాయి. పెళ్లి మండపాలను అభిరుచులకు, ధరలకు తగ్గట్టుగా ముస్తాబు చేస్తున్నాం.

– మందపాటి ముత్తారెడ్డి, ఎంఆర్ గార్డెన్స్ అధినేత, సత్తుపల్లి

ముహూర్తాలు ప్రారంభం



జనవరిలో పుష్యమాసం రావడం వల్ల నెలరోజులు ముహూర్తాలు లేవు. మళ్లీ మాఘమాసం ప్రారంభం కావటంతో ఏప్రిల్ వరకు మూడు నెలల పాటు ముహూర్తాలు ఉన్నాయి. ఏప్రిల్ తర్వాత మళ్లీ మూఢాలు వస్తున్నాయి.

– రామడుగు గురుప్రసాదాచార్యులు, పురోహితులు, సత్తుపల్లి

మండపాలు రిజర్వ్ అవుతున్నాయి



ప్రస్తుతం శుభ కార్యాల సీజన్ కావడంతో ఫంక్షన్ హాళ్లు రిజర్వ్ చేసుకుంటున్నారు. ఫిబ్రవరి, మార్చి నెలలు వివాహాలకు అనుకూల సమయం కావటంతో ముందుగానే బుక్ చేసుకున్నారు. ఈ మాఘ మాసంలో వివాహాలు ఎక్కువగా జరుగుతాయి. కొన్ని తేదీల్లో రోజుకు రెండు పెళ్లిళ్ల చొప్పున ఫంక్షన్ హాళ్లు బుక్ అవుతున్నాయి.

– గన్నారపు శబరినాథ్, ఫంక్షన్ హాల్ యజమాని, ముస్తాఫానగర్, ఖమ్మం

బొజ్జాయిగూడెంలో కోలాహలం





బొజ్జాయిగూడెం సమ్మక్క-సారలమ్మ గద్దెల ప్రాంతం, పూజలు చేస్తున్న భక్తులు

ఇల్లెందురూరల్: సమ్మక్క-సారలమ్మ జాతర ప్రారంభానికి ముందే మండలంలోని బొజ్జాయిగూడెం సమీప అటవీ ప్రాంతంలో వన దేవతల గద్దెల వద్ద భక్తుల సందడి నెలకొంది. మేడారంలో తరహాలోనే ఇక్కడ కూడా రెండేళ్లకోసారి జాతర నిర్వహిస్తారు. ఈ నెల 23న జాతర నిర్వహణకు ఏర్పాట్లు చేస్తుండగా, ఇప్పటి నుంచే భక్తుల తాకిడి పెరిగింది. వారం రోజులుగా కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకుని నైవేద్యంగా బంగారం (బెల్లం)ను సమర్పించుకుంటున్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతుండగా, నిర్వాహకులు సౌకర్యాలు కల్పిస్తున్నారు. ప్రత్యేకంగా స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నారు.

ఇల్లెందు పట్టణాభివృద్ధికి కృషి

- రూ.6.75 కోట్ల డీఎంఎఫ్‌టీ నిధులతో పనులు
- ఎమ్మెల్యే కోరం కనకయ్య



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య తదితరులు

ఇల్లెందు: ఇల్లెందు పట్టణాభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే కోరం కనకయ్య పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని జేకే బస్టాప్, గోవింద్ సెంటర్‌లో పలు అభివృద్ధి పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.6.75 కోట్ల డీఎంఎఫ్‌టీ నిధులతో ఎనిమిది అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. గోవింద్ సెంటర్ నుంచి చెరువు కట్ట (పాకాల రోడ్) వరకు డివైడర్, సెంట్రల్ లైటింగ్ పనులకు రూ. 2 కోట్లు, గోవింద్ సెంటర్ నుంచి సత్యనారాయణపురం వెళ్లే రహదారిలో సెంట్రల్ లైటింగ్‌కు రూ. కోటి, జేకే బస్టాప్ నుంచి కొత్త కాలనీ వరకు సెంట్రల్ లైటింగ్‌కు రూ. 50 లక్షలు, ఆర్టీసీ బస్టాండ్‌లో సీసీ ప్లాట్‌ఫారమ్ పనులకు రూ. 1.50 కోట్లు, మెయిన్ రోడ్‌కు ఇరువైపులా ఫుట్ పాత్ నిర్మాణానికి రూ.కోటి, ప్రభుత్వాస్పత్రిలో అంతర్గత రహదారుల నిర్మాణానికి రూ.25 లక్షలు, కరెంటాఫీస్ ఏరియా నుంచి డిగ్రీ కళాశాల వరకు సెంట్రల్ లైటింగ్‌కు రూ. 30 లక్షలు, లలిత కళామందిర్ రోడ్ లైటింగ్‌కు రూ. 20 లక్షలు కేటాయించినట్లు వివరించారు. అభివృద్ధి పనులను నిర్ణీత కాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పట్టణ అభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దామని అన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ నవీన్, మేనేజర్ అంకుషావలీ, కౌన్సిలర్లు వారా రవి, కటకం పద్మావతి, సయ్యద్ ఆజమ్, సిలివేరు అనిత, పత్తి స్వప్న, కడకంచి పద్మ, జేకే శ్రీనివాస్, ఏఈ రాజు, కాంగ్రెస్ నాయకులు ఎస్‌కె జానీ, పింగళి నరేష్‌కుమార్, మడుగు సాంబమూర్తి, మాజీ మున్సిపల్ చైర్మన్ యదళ్లపల్లి అనసూర్య, సుదర్శన్ కోరీ, గోచికొండ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

బైక్‌పై నుంచి జారి పడి వివాహిత మృతి

అశ్వారావుపేటరూరల్: ద్విచక్రవాహనంపై నుంచి అదుపుతప్పి కింద పడిన ఘటనలో ఆదివారం ఓ వివాహిత మృతి చెందింది. స్థానికుల కథనం ప్రకారం.. అశ్వారావుపేటలోని దొంతికుంటకు చెందిన పచ్చినీల జ్యోతి(37) తన భర్త రాజాతో కలిసి ఏపీలోని ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండలం బయ్యన్నగూడెం గ్రామంలో ఉన్న తమ బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లింది. అనంతరం ద్విచక్రవాహనంపై తిరిగి వస్తుండగా జీలుగుమిల్లి మండలంలోని గంపలగూడెం వద్ద జ్యోతి ఒక్కసారిగా అదుపుతప్పి కింద పడిపోయింది. దీంతో తీవ్రగాయాలు కాగా 108 వాహనంలో అశ్వారావుపేట సామాజిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందిందని తెలిపారు. మృతురాలికి భర్త, ఇద్దరు సంతానం ఉన్నారు. జీలుగుమిల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి విక్రయిస్తున్న ముఠా అరెస్ట్

- ఐదుగురు నిందితుల నుంచి 2.4కిలోల గంజాయి, బైక్, సెల్‌ఫోన్లు స్వాధీనం
- పరారీలో మరొకరు
- వివరాలు వెల్లడించిన సూర్యాపేట ఎస్పీ రాహుల్ హెగ్డే



వివరాలు వెల్లడిస్తున్న సూర్యాపేట ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేట క్రైం : గంజాయి విక్రయిస్తున్న ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 2.4కిలోల గంజాయితో పాటు బైక్, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. సూర్యాపేట జిల్లా పోలీసు కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ రాహుల్ హెగ్డే నిందితుల వివరాలు వెల్లడించారు. భద్రాద్రి జిల్లా టేకులపల్లికి చెందిన బోడ సురేశ్, బానోతు మోహన్, భూక్యా అఖిల్, ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం బచ్చోడుతండాకు చెందిన ధరావత్ వినోద్, కూసుమంచి మండలం మంగలిబండతండాకు చెందిన నూనావత్ సాయి, సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం బేతవోలు గ్రామానికి చెందిన గణపారపు శ్రీకాంత్ స్నేహితులు. వీరు ఓ ముఠాగా ఏర్పడి సులువుగా డబ్బులు సంపాదించేందుకు గంజాయి విక్రయించాలని నిర్ణయించుకున్నారు. రెండేళ్లుగా ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల సరిహద్దుల నుంచి రూ.4,500కు కిలో చొప్పున గంజాయిని కొనుగోలు చేసి, సూర్యాపేట జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు.

గంజాయి రవాణా చేస్తూ..


ముఠాలోని బోడ సురేశ్, భూక్యా అఖిల్ కుమార్, బానోతు మోహన్, వినోద్ ఆంధ్రప్రదేశ్ నుంచి తీసుకొచ్చిన 2.4కిలోల గంజాయిని సూర్యాపేట జిల్లాలోని చిలుకూరు మండలం గనపారపు శ్రీకాంత్‌కు అప్పగించాలని నిర్ణయించుకున్నారు. వీరిలో బోడ సురేశ్, భూక్యా అఖిల్‌లు బైక్ మీద, బానోతు మోహన్, ధరావత్ వినోద్ గత శనివారం బస్సులో ఇదే జిల్లా మునగాల మండలంలోని బరాకత్‌గూడెం వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి ఆటోలో చిలుకూరు మండలం బేతవోలు గ్రామ శివారులో మిషన్ భగీరథ ఓవర్ హెడ్ ట్యాంక్ సమీపంలోని సాయిలి నవీన్ మామిడి తోటలోకి వెళ్లారు. అదే సమయంలో బేతవోలు గ్రామానికి చెందిన గనపరపు శ్రీకాంత్ అక్కడికి వచ్చాడు. అతడికి ముఠా సభ్యులు గంజాయి ప్యాకెట్లు ఇస్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారని ఎస్పీ వివరించారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.37 వేలు ఉంటుందని తెలిపారు. ఈ ముఠాలో మరో నిందితుడు నునావత్ సాయి పరారీలో ఉన్నాడని, త్వరలోనే పట్టుకుంటామని చెప్పారు. సమావేశంలో ఏఎస్పీ మేకా నాగేశ్వరరావు, కోదాడ రూరల్ సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్‌ఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పలువురు సీఐ, ఎస్‌ఐల బదిలీ

కొత్తగూడెంటౌన్: జిల్లాలో ఏడుగురు సీఐలు, పలువురు ఎస్సైలను బదిలీ చేస్తూ పోలీసు ఉన్నతాధికారులు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీఅయిన వారి వివరాలు ఇలా ఉన్నాయి.

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
టి.సురేష్	వెయిటింగ్ మల్టిజోన్-1	టేకులపల్లి
అలేటి ఇంద్రసేనారెడ్డి	టేకులపల్లి	కొత్తగూడెం రూరల్
మల్లంపల్లి శ్రీనివాస్	కొత్తగూడెం రూరల్	వీఆర్ కొత్తగూడెం
ఆర్.వెంకటేశ్వర్లు	వీఆర్ కొత్తగూడెం	భద్రాచలం
పింగిలి నాగరాజు	భద్రాచలం	రిపోర్టు మల్టిజోన్-1
అలెం రాజువర్మ	ఎస్‌బీ-11, కొత్తగూడెం	చర్ల
సాట్ల రాజు	వెయిటింగ్	ఎస్‌బీ-11, కొత్తగూడెం
బి.గిరిధర్‌రెడ్డి(ఎస్‌ఐ)	కొమరారం	తిరుమలయపాలెం
పి.సంతోష్(ఎస్‌ఐ)	లక్ష్మీదేవిపల్లి	ఖమ్మం ఖానాపూర్ హవేలి
బి.రాజగోపాల్	చర్ల	పర్వతగిరి(వరంగల్)

వడ్డెర కులాన్ని ఎస్టీ జాబితాలో చేర్చాలి



నియామక పత్రం అందుకుంటున్న జిల్లా అధ్యక్షుడు

కొత్తగూడెంఅర్బన్: వడ్డెర కులాన్ని బీసీ నుంచి తొలగించి ఎస్టీ జాబితాలో చేర్చాలని వడ్డెర సంఘం రాష్ట్ర కార్యదర్శి గుర్రం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. తెలంగాణ వడ్డెర సంఘం జిల్లా ముఖ్య నాయకుల సమావేశం జిల్లా ఉపాధ్యక్షుడు ముద్దంగుల శంకర్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. తొలుత సంఘం నూతన జిల్లా అధ్యక్షుడిగా ఒర్సు సంపత్‌ను నియమించారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ వడ్డెర విద్యార్థులకు గురుకుల పాఠశాలల్లో ప్రత్యేక రిజర్వేషన్ కల్పించాలని, వడ్డెర కార్మికులు వృత్తిలో ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.20 లక్షల ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని, వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

ప్రెజర్‌బాంబు పేలి జవాన్‌కు గాయాలు

మూడు మందుపాతరలను నిర్వీర్యం చేసిన బలగాలు



అటవీ ప్రాంతంలో మావోయిస్టులు అమర్చిన మందుపాతర

చర్ల: మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలి జవానుకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన ఆదివారం ఛతీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో చోటు చేసుకుంది. బీజాపూర్ జిల్లాలోని దుమ్రీపాల్ సీఆర్‌పీఎఫ్ క్యాంపు నుంచి కూంబింగ్ ఆపరేషన్, ఏరియా డామినేషన్‌ల కోసం భద్రతా బలగాలు దూమ్రీపాల్-తోయినార్ మార్గం నుంచి వెళ్తున్నాయి. ఈ క్రమంలో మావోయిస్టులు భద్రతా బలగాలను లక్ష్యంగా ఏర్పాటు చేసిన ప్రెజర్‌బాంబు పేలి చస్పాల్ అనే జవాన్ కాళ్లకు గాయాలయ్యాయి. దీంతో సహచర జవాన్లు ఆయన్ను సమీపంలోని నెల్సానార్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ప్రథమ చికిత్స నిర్వహించి అనంతరం బీజాపూర్ జిల్లా ఆస్పత్రికి, అక్కడినుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో రాయ్‌పూర్‌కు తీసుకెళ్లారు. అనంతరం ప్రెజర్‌బాంబు పేలిన ప్రాంతంలో తనిఖీలు నిర్వహించగా మూడు మందుపాతరలు బయటపడ్డాయి. వీటిలో రెండింటిని ఆ ప్రాంతంలోనే నిర్వీర్యం చేశారు. ఒక దానిని సురక్షితంగా బయటకు తీశారు.

ఆటో, కారు ఢీ : ఎనిమిది మందికి గాయాలు



బోల్తా పడిన ఆటో

దుమ్ముగూడెం: మండలంలోని పర్ణశాల క్రాస్ రోడ్ దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎనిమిది మందికి గాయాలైన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. భద్రాచలానికి చెందిన ఎనిమిది మంది వ్యక్తులు ఆటోలో పర్ణశాల దైవదర్శనానికి వచ్చారు. దర్శనం అనంతరం తిరుగు ప్రయాణంలో ఆటో పర్ణశాల క్రాస్ రోడ్డు దాటుతుండగా వెంకటాపురం నుంచి భద్రాచలం వైపు వస్తున్న కారు ఢీకొట్టింది. దీంతో ఆటో వెళ్లి విద్యుత్ స్తంభాన్ని ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న ఎనిమిది మందికి గాయాలయ్యాయి. ఆటో ముందు భాగం దెబ్బతిన్నది. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ములకపాడు వైద్యశాలకు, అక్కడి నుంచి భద్రాచలం ఏరియా వైద్యశాలకు తరలించారు.

ఏడుగురు యువకుల అరెస్ట్



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

చుంచుపల్లి: విద్యానగర్ కాలనీతో పాటు పలు ప్రాంతాలకు చెందిన యువకులు స్థానిక చింతలచెరువు కట్టమీద గల మైసమ్మ గుడి వద్ద గంజాయి తాగుతుండగా చుంచుపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ ఆదివారం వివరాలు వెల్లడించారు. చుంచుపల్లి మండలం రామాంజనేయ కాలనీ, గాంధీ కాలనీ, రామ్ నగర్, ఎదురుగడ్డ, పాల్వంచ వనమా కాలనీలకు చెందిన కొందరు యువకులు విద్యానగర్ చింతలచెరువు గట్టుమీద శనివారం గంజాయి తాగుతూ పట్టుబడ్డారు. పట్టుబడిన వారిలో దొమ్మేటి మధు, గొల్లపల్లి మోహన్, షేక్ హాసన్, ఇరగ దిండ్ల రాహుల్, బొంకూరి రోహిత్, కోవెలపూడి సాయి భరత్, అందురి వీరేందర్ ఉన్నారు. వీరినుంచి రూ. 1.32 లక్షల విలువైన 5.5 కేజీల గంజాయిని ఎస్సై ప్రవీణ్ కుమార్ సిబ్బందితో కలిసి స్వాధీనం చేసుకున్నారు. మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. కాగా సుందర్ కుమార్, ధోని, పాల శివ, శ్రీకాంత్, ఉదయ్, ప్రేమ్ కుమార్, చింటూ, అరవింద్, వంశీనాథ్, తాజ్‌లు పరారైనట్లు వివరించారు. సీఐ పెద్దన్నకుమార్, ఎస్సై ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

ఎవరితో కలిసినా.. ఎవరిని వదిలేసినా.. ఏం చేసినా

నా ప్రయోజనాలే రాష్ట్ర ప్రయోజనాలు

చంద్రబాబు అవకాశవాద రాజకీయాలకు 'రాష్ట్రం' ముసుగు

- పవన్, బీజేపీ, కాంగ్రెస్... ఎవరితో కలిసినా, విడిపోయినా ఇదే మాట
- స్వప్రయోజనాలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు నక్కజిత్తులు
- 1999తో వాజ్ పేయితో కలిసినప్పుడు రాష్ట్ర హితం కోసమేనంటూ హడావుడి
- విడిపోయాక మతతత్వ పార్టీతో కలిసి తప్పు చేశానని పశ్చాత్తాపం
- 2014లో పాజిటివ్ ఓటు కోసం మళ్లీ రాష్ట్ర ప్రయోజనాలంటూ బీజేపీతో పొత్తు
- 2019లో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసమే విడిపోయానంటూ దాంబికాలు
- మళ్లీ ఇపుడు రాష్ట్ర ప్రయోజనాలకోసమే బీజేపీతో కలిసే ప్రయత్నాలంటూ వ్యాఖ్యలు
- ప్రత్యేక హోదా సంజీవని కాదు.. ప్యాకేజీ చాలన్నప్పుడు కూడా ఇదే మాట
- ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచినప్పుడూ... ప్రజాస్వామ్యం కోసమేనని ప్రచారం
- ఆఖరికి మద్య నిషేధం ఎత్తివేసినపుడు కూడా అదే ముసుగు
- బాబు ఏం చేసినా 'రాష్ట్ర ప్రయోజనాల' కోసమేనంటూ ఎల్లో మీడియా దరువు
- వాస్తవానికి అధికారం, కుటుంబ ప్రయోజనాలు తప్ప ఏవీ పట్టని బాబు
- తనయుడి కోసం, అధికారం కోసం ఏం చేయటానికైనా నారా వారు రెడీ



(సాక్షి, అమరావతి)

ఈ మధ్య 'శరణు... శరణు' అంటూ బీజేపీతో పొత్తులు కుదుర్చుకోవటానికి చంద్రబాబు నాయుడు ఢిల్లీకి వెళ్లినపుడు ఎల్లో మీడియా మొత్తం ఒకటే రచ్చ. చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రయోజనాల కోసమే ఢిల్లీకి వెళ్లారని, రాష్ట్ర హితం కోసం కాస్త తగ్గి అయినా బీజేపీతో పొత్తు పెట్టుకోవాలన్నది ఆయన ఉద్దేశమని!!. మరో పచ్చపత్రిక హద్దులన్నీ దాటేసి.. నారా వారు గెలవటం రాష్ట్రానికి చారిత్రక అవసరమని తేల్చిచెప్పేసింది!.

ఒక్కటి మాత్రం నిజం. జనం నవ్విపోతారన్న సిగ్గు బాబుకు, ఆయన మీడియాకు కాస్తయినా లేదు. ఎన్ని పనికిమాలిన పనులు చేసినా, ఎన్ని అపవిత్ర పొత్తులు పెట్టుకున్నా.. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసమేనని, రాష్ట్ర ప్రయోజనాల కోసమేనని జనాన్ని నమ్మించడానికి బాబు, ఆయన ముఠా నిస్సిగ్గుగా ప్రయత్నిస్తున్నారంటే... ఎవ్వరినైనా మేనేజ్ చేయగలమన్న వీళ్ల తెంపరితనమే కారణమనుకోవాలి.

నీచపు ఎత్తుగడల్లో వేరెవ్వరికీ సాధ్యం కాని చారిత్రక ట్రాక్ రికార్డు చంద్రబాబు నాయుడిది. ఎందుకంటే ఆయన ఇప్పటిదాకా భారతీయ జనతా పార్టీతో రెండు సార్లు కలిశారు... రెండు సార్లు విడిపోయారు. మళ్లీ మూడోసారి కలవటానికి కాళ్ల బేరంతో సహా అన్ని ప్రయత్నాలూ చేస్తున్నారిపుడు. జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌తోనూ ఇలాంటి బంధమే. 2014లో కలిశారు... 2019లో విడిపోయారు. మళ్లీ ఇపుడు కలిసిపోయారు. ఆఖరికి తన జన్మ విరోధి కాంగ్రెస్‌తోనూ 2019 తెలంగాణ ఎన్నికల్లో ప్రత్యక్ష పొత్తు పెట్టేసుకున్నారు. ఈ సారి మాత్రం తెలంగాణతో పాటు ఏపీలోనూ పరోక్ష పొత్తుతో లాగిస్తున్నారు. ఇవన్నీ చూస్తే ఎవ్వరికైనా ''ఛీ.. అధికారం కోసం మరీ ఇంతలా దిగజారిపోవాలా?'' అనిపించకమానదు. కానీ బాబు పెంచి పోషిస్తున్న ఎల్లో మీడియా మాత్రం దీన్ని మరో కోణంలో చూపించడానికి ప్రయత్నిస్తోంది. ఎప్పటికప్పుడు బాబు చేసిన లాంటి దిగజారుడు పనులన్నిటికీ 'రాష్ట్ర ప్రయోజనాల కోసమే' అనే ముసుగు వేస్తోంది. ప్రజాస్వామ్యం కోసం, రాష్ట్ర హితం కోసం తప్పనిసరి పరిస్థితుల్లో బాబు ఇవన్నీ చేశారనే కలర్ ఇవ్వటానికి ప్రయత్నిస్తోంది. బాబు కూడా.. రాష్ట్ర ప్రయోజనాల కోసమే బీజేపీతో కలిసే ప్రయత్నం చేస్తున్నట్లు పార్టీ నేతల సమావేశంలో చెప్పొచ్చారు. 40 ఏళ్ల రాజకీయ జీవితంలో తన సొంత ప్రయోజనం కోసం తీసుకున్న నిర్ణయాలన్నింటినీ ఆయన రాష్ట్రం కోసం, ప్రజల కోసమే తీసుకున్న నిర్ణయాలుగా వివరించే ప్రయత్నాన్ని చూసి పార్టీ నేతలే నివ్వెరపోవాల్సి వచ్చిందని సమాచారం.

ఆది నుంచి స్వప్రయోజనాలే పరమావధి...

కాంగ్రెస్ పార్టీతో రాజకీయ జీవితాన్ని మొదలుపెట్టిన చంద్రబాబు... ఆ పార్టీ ఓడిపోవటంతో, దానికి బద్ధ శత్రువైన తెలుగుదేశం పార్టీలో చేరిపోయారు. అల్లుడు కాబట్టి చేర్చుకోవాల్సి వచ్చింది నాటి తెలుగుదేశాధిపతి ఎన్టీఆర్‌కు. ఆ తరవాత ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి పార్టీని లాక్కుని.. ఇదంతా ప్రజాస్వామ్యాన్ని బతికించడానికే చేశానని నాటి తన ఎల్లో మీడియా సాయంతో చెప్పగలిగారు చంద్రబాబు. నిజాలు అందరికీ తెలిసినా... ఇప్పటికీ అదే అబద్ధాన్ని పదేపదే చెబుతూ ఉంటారు చంద్రబాబు. ఆ రోజు ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికే అలా చేయాల్సి వచ్చిందంటుంటారు. తన చెంచాలతో చెప్పిస్తుంటారు కూడా. ఇక 1999లో బీజేపీకి ఉన్న పాజిటివ్ ఓటు సాయంతో రాష్ట్రంలో గట్టెక్కవచ్చని భావించి... ఆ పార్టీతో పొత్తు పెట్టుకుని విజయం సాధించారు. బీజేపీతో అధికారాన్ని పంచుకుని కేంద్రంలో చక్రం తిప్పినట్లు మహా బిల్డప్ ఇచ్చి ఇప్పటికీ దాని గురించి చెప్పుకుంటూనే ఉంటారు.

మళ్లీ బీజేపీతో జట్టుకట్టేశారు...

కానీ 2004 ఎన్నికలు వచ్చే సరికి పరిస్థితి మారిపోయింది. దేశవ్యాప్తంగా బీజేపీ వ్యతిరేక గాలి వీస్తోంది. అది తనమీదా పడొచ్చనే భయంతో ఆ పార్టీతో తెగ తెంపులు చేసుకుని బయటకు వచ్చేశారు. దాన్ని సమర్థించుకునే ప్రయత్నంలో... బీజేపీ మతతత్వ పార్టీ అని, ప్రజాస్వామ్యానికి-లౌకిక తత్వానికి ప్రమాదకరమని ఆరోపణలు చేశారు. మతతత్వ బీజేపీతో పొత్తు పెట్టుకుని తప్పు చేశానని పశ్చాత్తాపం నటించారు. విచిత్రమేంటంటే రాష్ట్రాన్ని విభజించాలని కోరుతున్న టీఆర్ఎస్‌తో 2009 ఎన్నికల్లో పొత్తు పెట్టుకున్నారు. టీఆర్ఎస్, వామపక్షాలతో కలిసి మహాకూటమిగా ఏర్పడి అప్పట్లో దానిక్కూడా రాష్ట్ర ప్రయోజనాలనే ముసుగు వేసినా... ప్రజలు తిప్పికొట్టారు. ఇక 2014 ఎన్నికల్లో మోడీ హవా కొనసాగుతుండడంతో... మళ్లీ బీజేపీ పంచన చేరి, రాష్ట్ర ప్రయోజనాల కోసం తప్పలేదంటూ సమర్థించుకున్నారు. అప్పుడు కూడా కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ అధికారాన్ని పంచుకుని రాష్ట్రంలో చెలరేగిపోయారు. దోచుకో-పంచుకో-తినుకో అనే రీతిలో సహజ వనరులన్నిటినీ కొల్లగొట్టారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని తన అధికార భాగస్వామిని అడగకుండా... హోదా ఏమీ సంజీవని కాదు కదా? హోదా వస్తే అన్ని సమస్యలూ పోతాయా? అని ఎదురు ప్రశ్నించారు. కేంద్రంతో లాలూచీ పడి, ప్రత్యేక ప్యాకేజీ ఇస్తే చాలన్నారు. పోలవరాన్ని కేంద్రం నిర్మిస్తానని చెప్పినా... కమీషన్ల కోసం ఆ బాధ్యత తమకే ఇవ్వాలని పట్టుబట్టారు. బాబు కమిషన్ల యావను అర్థం చేసుకున్న బీజేపీ... ప్రత్యేక ప్యాకేజీ పేరిట డబ్బు మూటలు పంపి చేతులు దులుపుకొంది. హోదాను పక్కనబెట్టేసింది.

హోదా వద్దని...
మళ్లీ దానికోసం డ్రామా

2019 ఎన్నికల్లో బీజేపీ ఓడిపోయి కేంద్రంలో కాంగ్రెస్ గెలుస్తుందనే అంచనాతో చంద్రబాబు చెలరేగిపోయారు. ఎన్డీఏ నుంచి బయటకు వచ్చి కాంగ్రెస్‌తో జత కట్టారు. తనకు భార్య, కొడుకు, మనవడు ఉన్నారని.. మోదీకి ఎవరున్నారని, అసలు మోదీ ఎవరని ప్రశ్నిస్తూ వ్యక్తిగతంగా నాటి ప్రధానిని దూషించారు. తిరుపతికి వచ్చిన అమిత్‌షాపై తన మనుషులతో రాళ్లు వేయించారు. అంతేకాదు.. నాడు ప్రతిపక్ష నేతగా ఉన్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక హోదా కోసం ఉద్యమించడంతో తాను కూడా హోదా డిమాండ్‌ను ఎత్తుకున్నారు. ప్యాకేజీకి అంగీకరించిన నోటితోనే హోదా కావాలని ఎలా అడుగుతారని జనం ప్రశ్నించినా.. అదంతా రాష్ట్ర ప్రయోజనాల కోసమే చేశానంటూ నాలుక మడతేశారు. ఆ ఎన్నికల్లో ఓడిపోయాక మళ్లీ బీజేపీ ప్రాపకం కోసం పాకులాడి... తొలుత తన పార్టీలోని అనయాయులు కొందరిని ఆ పార్టీలోకి పంపేశారు. వారి సాయంతో ఇపుడు బీజేపీ అగ్ర నేతల కాళ్లావేళ్లా పడి ఎలాగైనా ఆ పార్టీతో కలవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదంతా రాష్ట్ర ప్రయోజనాల కోసమే అని చెబుతున్నారు.

మద్య నిషేధానికీ
ఇదే ముసుగు..

చంద్రబాబువి ఎంత దుర్మార్గపు పనులో... దాన్ని ఎల్లో మీడియా ఎలా కవర్ చేస్తుందో తెలియటానికి మద్య నిషేధాన్ని చక్కని ఉదాహరణగా చెప్పుకోవచ్చు. 1994లో అధికారంలోకి వచ్చాక నాటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ తన మాట ప్రకారం... 1995 జూన్ నుంచీ సంపూర్ణ మద్య నిషేధాన్ని అమల్లోకి తీసుకొచ్చారు. కానీ ఆయన్ను వెన్నుపోటు పొడిచి 1996లో అధికారాన్ని చేపట్టిన చంద్రబాబు... నిండా ఏడాది కూడా గడవక ముందే నిషేధాన్ని ఎత్తివేశారు. పక్క రాష్ట్రాల నుంచి మద్యం విచ్చలవిడిగా వస్తోందంటూ... దానివల్ల రాష్ట్ర ప్రయోజనాలు దెబ్బతింటున్నాయని, రాష్ట్ర హితం కోసం నిషేధాన్ని ఎత్తివేయక తప్పడం లేదని చెప్పి మళ్లీ మద్యాన్ని తెచ్చేశారు. పక్క రాష్ట్రాల నుంచి మద్యం వస్తుంటే అడ్డుకోవాలి గానీ, నిషేధాన్ని ఎత్తివేయటమేంటని వేసిన ప్రశ్నలకు ఇప్పటికీ జవాబుల్లేవు మరి!!. ఆయన జవాబివ్వనిది కూడా... రాష్ట్ర ప్రయోజనాల కోసమేనేమో!!.



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ ఈశ్వరయ్య. చిత్రంలో జస్టిస్ చంద్రకుమార్, ప్రొఫెసర్ మురళీమనోహర్ తదితరులు

కులాల సమగ్ర గణన జరపాల్సిందే

- రౌండ్‌టేబుల్ సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం
- బీసీ కేటగిరీల్లో కులగణన జరిపితే బీసీలకు అత్యంత నష్టం
- జనాభాలో ఉన్న కులాల సంఖ్య తెలియకుండా గణన అసాధ్యం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం అన్ని కులాల సమగ్ర గణన జరపాలని పీపుల్స్ కమిటీ ఆన్ క్యాస్ట్ సెన్సెస్ డిమాండ్ చేసింది. కేవలం బీసీ వర్గంలోని కులాలను మాత్రమే గణిస్తే అది బీసీ సామాజికవర్గానికి అత్యంత ప్రమాదకారి కానుందని ఆందోళన వ్యక్తం చేసింది. అన్నికులాల గణనపైన రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని, లేకుంటే క్షేత్రస్థాయిలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించేందుకు వెనుకాడమని పీపుల్స్ కమిటీ ఆన్ క్యాస్ట్ సెన్సెస్ తేల్చిచెప్పింది. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో పీపుల్స్ కమిటీ ఆన్ క్యాస్ట్ సెన్సెస్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ప్రొఫెసర్ మురళీమనోహర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి జాతీయ బీసీ కమిషన్ మాజీ చైర్మన్, జస్టిస్ ఈశ్వరయ్య, జస్టిస్ చంద్రకుమార్, వివిధ విశ్వవిద్యాలయాల నుంచి సీనియర్ ప్రొఫెసర్లు పాల్గొన్నారు. అన్ని కులాల సమగ్ర కులగణన చేయాలని రౌండ్‌టేబుల్ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది.

కులగణన చేపట్టాలి

ఈ సందర్భంగా జస్టిస్ ఈశ్వరయ్య మాట్లాడుతూ కులగణన చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు స్థానిక సంస్థలకు ఉందన్నారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వాలు కులగణన చేపట్టి సంక్షేమ కార్యక్రమాలు, రిజర్వేషన్లు అమలు చేయాలని, ఇప్పటికే పలు రాష్ట్రాల్లో ఈ ప్రక్రియ పూర్తి చేసి రిజర్వేషన్లు అమలు చేస్తున్నట్టు ఆయన చెప్పారు. రాష్ట్రప్రభుత్వం కులగణన చేపడతామని ప్రకటించడం, కేబినెట్ సమావేశంలో ఈమేరకు ఆమోదించడం శుభపరిణామమన్నారు. కానీ కులగణన కేవలం బీసీ కులాలకు మాత్రమే పరిమితం చేస్తామంటూ అధికారవర్గాలు చెబుతున్నాయని, అలా బీసీ కులగణన చేపడితే వెనుకబడిన వర్గాలు అత్యంత ఎక్కువగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. బీసీ కులగణన అనేది శాస్త్రీయంగా సరికాదని, బీసీ కులానికి చెందిన వారి ఇంటికి వెళ్లి సర్వే చేయడంతో ఇతర కులాల గణాంకాలు ఎలా తెలుస్తాయని ప్రశ్నించారు. జనాభాలో ఏయే కులాలు ఎంత సంఖ్యలో ఉన్నాయో తెలిస్తేనే కులాల వారీగా వాటా స్పష్టమవుతుందని చెప్పారు. ఈ దిశగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుని స్పష్టత ఇవ్వాలన్నారు.

మేధావులతో చర్చిస్తే మంచి ఫలితం

జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ కులగణన ప్రక్రియ చేపట్టే ముందు రాష్ట్ర ప్రభుత్వం అన్ని కులాల్లోని మేధావులతో చర్చిస్తే మంచి ఫలితం ఉంటుందన్నారు. న్యాయపరమైన అంశాలు చర్చకు వస్తాయని, వాటిని అధిగమించేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి కూడా కార్యాచరణ చేసుకునే వీలుంటుందని చెప్పారు. అన్ని కులాల సమగ్ర కులగణన చేపట్టడమే రాష్ట్ర ప్రభుత్వం ఎజెండాగా ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు.

సీఎంకు మరోమారు నివేదిస్తాం

ప్రొఫెసర్ మురళీమనోహర్ మాట్లాడుతూ సమగ్ర కులగణన కోసం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి మరోమారు నివేదిస్తామన్నారు. ఇదివరకు సీఎంను కలిసినప్పుడు బీసీ సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశంతో మాట్లాడాలని, ప్రత్యేకంగా వర్క్‌షాప్ నిర్వహించాలని సీఎం ఆదేశించినా, ఇంకా నిర్వహించలేదని తెలిపారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయానికి అనుగుణంగా తదుపరి కార్యాచరణ ఉంటుందని వివరించారు.

జిల్లా వార్తలు

బోధనా నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలి

ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్



మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్

బూర్గంపాడు: విద్యార్థులకు సులువైన రీతిలో పాఠాలను బోధించేలా ఉపాధ్యాయులు నైపుణ్యం పెంచుకోవాలని భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ అన్నారు. సారపాక ఐటీసీ అనుబంధ భద్రాచలం పబ్లిక్ స్కూల్‌లో గిరిజన సంక్షేమశాఖ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఇంగ్లిష్ మీడియం బోధనకు ఆదివారం శిక్షణా కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ.. వారానికి 20 మంది చొప్పున నిపుణులైన అధ్యాపకుల పర్యవేక్షణలో ఉపాధ్యాయులు శిక్షణ తీసుకోవాలన్నారు. ఇంగ్లిష్ మీడియంలో పాఠ్యాంశాల బోధన, విద్యార్థులతో ఇంగ్లిష్ మాట్లాడే తీరును ఉపాధ్యాయులు మెరుగుపరుచుకోవాలని సూచించారు. గిరిజన విద్యార్థులకు అర్థమయ్యేలా బోధన చేయాలని చెప్పారు. తెలుగు మీడియం నుంచి ఇంగ్లిష్ మీడియానికి మారిన పాఠశాలల ఉపాధ్యాయులు తప్పకుండా శిక్షణా తరగతులకు హాజరు కావాలని సూచించారు. శిక్షణ ఇచ్చే అధ్యాపకులు కూడా ఉపాధ్యాయులకు బోధనలో తగిన మెళకువలను వివరించాలన్నారు. ఇంగ్లిష్ మీడియం పాఠశాలలపై ఐటీడీఏ ప్రత్యేక దృష్టి సారిస్తోందని తెలిపారు. గిరిజన విద్యార్థులు ఇంగ్లిష్ మీడియంలో రాణించాలంటే ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం, ఖమ్మం ఏసీఎంఓలు రమణయ్య, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కిన్నెరసానిలో జలవిహారం



బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్: మండల పరిధిలోని కిన్నెరసానిలో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. 953 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించడం ద్వారా వైల్డ్‌లైఫ్ శాఖ రూ.27,905 ఆదాయం, 230మంది బోటు షికారు చేయడం ద్వారా టూరిజం కార్పొరేషన్‌కు రూ.14 వేల ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపా రు. ఏపీ రిటైర్డ్ పీసీసీఎఫ్ నార్పత్ సింగ్ కుటుంబసభ్యులతో కలిసి కిన్నెరసానిని సందర్శించారు. ఆయన వెంట రేంజర్ శ్రీనివాసరావు, సెక్షన్ ఆఫీసర్ హారిక, ఎఫ్‌బిఓ రవి ఉన్నారు.

అగ్నిప్రమాదాలను అడ్డుకునేలా..



అడవిలో అగ్నిప్రమాదాలను ఫైర్ బ్లో ద్వారా నివారిస్తున్న ఉద్యోగులు

- అటవీ ప్రాంతంలో ఫైర్‌లైన్స్ ఏర్పాటు
- భద్రాద్రి జిల్లాలో 122.65 కి.మీ. మేర ఫైర్‌లైన్స్
- ప్రమాదాల నివారణకు 14 ఫైర్‌బ్లో బృందాలు కూడా..



ఫైర్‌లైన్స్ మార్గంలో కాలిపోయిన ఆకులు

పాల్వంచరూరల్: వేసవి వచ్చిందంటే అటవీ ప్రాంతంలో అగ్నిప్రమాదాలు తరచుగా జరుగుతుంటాయి. ఈ నేపథ్యాన అటవీ శాఖ ఫైర్‌లైన్స్ ఏర్పాటుతో ప్రమాదాలు జరగకుండా అడ్డుకట్ట వేసేందుకు రంగంలోకి దిగింది. వేసవి రాకముందే ఫైర్‌లైన్స్ ఏర్పాటుచేయడంతో పాటు అటవీసమీప ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా ప్రమాదాలకు చెక్ పెట్టాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా భద్రాద్రి జిల్లాలోని ఆరు డివిజన్లలో 122.65 కిలోమీటర్ల మేర ఫైర్‌లైన్స్ ఏర్పాటుకు నిధులు మంజూరు కాగా పనులు మొదలయ్యాయి.

4,28,698 చ.కి.మీ. పరిధిలో అడవి

భద్రాద్రి జిల్లాలో 4,28,698 చదరపు కిలోమీటర్ల పరిధిలో అటవీ విస్తీర్ణం ఉంది. దీన్ని ఆరు డివిజన్లు, 24 రేంజ్‌లు, 944 బీట్లుగా విభజించారు. అయితే, ఇందులో చాలావరకు దట్టమైన అటవీ ప్రాంతం కావడం, ఎండాకాలంలో ఆకులు రాలుతుండగా... కట్టెల కోసం, ఇతర అవసరాల కోసం వెళ్లిన వారు చుట్టలు, సిగరెట్లు తాగి పడేస్తే ఎండిన ఆకులకు అంటుకుని అగ్నిప్రమాదాలు జరుగుతున్నాయి. ఫలితంగా విలువైన అటవీ సంపద అగ్నికి ఆహుతవుతోంది. దీంతో ప్రమాదాలకు అరికట్టేందుకు ఫైర్‌లైన్స్ ఏర్పాటు చేస్తున్నారు.

'కంపా' నిధులు

జిల్లాలోని అటవీ ప్రాంతంలో రూ.19,45,197 కంపా నిధులతో 122.65 కిలోమీటర్ల మేర ఫైర్‌లైన్స్ ఏర్పాటుచేస్తున్నారు. అయితే, గత ఏడాది 620 కి.మీ. పరిధిలో ఫైర్‌లైన్స్ ఏర్పాటుచేయగా.. ఈసారి నిధులు తగ్గడంతో లైన్స్ నిడివి కూడా తగ్గిపోయింది. కాగా, తరచూ గుండాల, మణుగూరు, ఇల్లెందు, భద్రాచలం, చర్ల అటవీ ప్రాంతాల్లో అగ్నిప్రమాదాలు జరుగుతాయని గుర్తించి ఆయా ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించారు.

గిరిజన కూలీలకు ఉపాధి

అటవీ ప్రాంతంలో అగ్నిప్రమాదాల నివారణ కోసం అటవీ శాఖ ఏటా ఫైర్‌లైన్స్ ఏర్పాటు చేస్తుండగా వందలాది మంది గిరిజనులకు ఉపాధి లభిస్తోంది. అడవిలో రాలిన ఆకులను ఓ క్రమపద్ధతిలో పోగేయడాన్ని ఫైర్‌లైన్ అంటారు. ఈ లైన్‌కు మంట అంటిస్తే చుట్టుపక్కల వ్యాపించకుండా ఆ వరుస క్రమంలోనే ఆకులు కాలిపోతాయి. తద్వారా రాలిన ఆకులన్నీ కాలిపోయి ఎవరైనా నిప్పు వేసినా మంట వ్యాప్తి తక్కువగా ఉంటుంది. ఇలా ఆకులు పోగేయడం, మంట అంటించే పనులకు గిరిజనులను వినియోగిస్తుండడంతో వారికి దాదాపు నెల పాటు ఉపాధి లభిస్తోంది.

ఫైర్‌వాచర్లను కూడా నియమిస్తే..

వేసవిలో అడవులకు నిప్పు అంటుకుని ప్రమాదాలు జరగకుండా ముందస్తు సమాచారం ఇచ్చేందుకు ఫైర్ వాచర్లను నియమించేవారు. కానీ ఈ ఏడాది మోక్షం లభించలేదు. అయితే, నిధుల కారణంగానే నియమించలేదని తెలుస్తుండగా.. ఈ పనులకు అటవీ సిబ్బందిని వినియోగిస్తున్నారు. అలాకాకుండా ఫైర్ వాచర్లను నియమిస్తే అగ్నిప్రమాదాలను ముందుగానే పసిగట్టి మంటలు వ్యాపించకుండా చర్యలు తీసుకునే అవకాశముంటుంది. ఇప్పటివరకైతే సిబ్బందితో ఫైర్‌బ్లో బృందాలను ఏర్పాటుచేసి మంటలు ఆర్పేందుకు వినియోగిస్తున్నారు. అలాగే, అటవీ సమీప ప్రాంతాల్లో ప్రజలకు మంటలు అంటుకోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణపై అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

అగ్నిప్రమాదాల నివారణకు పటిష్టచర్యలు



జిల్లాలోని అటవీ డివిజన్ల పరిధిలో అగ్నిప్రమాదాల నివారణ కోసం అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఫైర్‌లైన్స్ ఏర్పాటు పనులు తుదిదశకు చేరుకున్నాయి. వేసవిలో అధికంగా అగ్ని ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాం. అలాగే, అడవుల సమీప గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

– కృష్ణగౌడ్, జిల్లా అటవీ శాఖాధికారి, భద్రాద్రి కొత్తగూడెం

లహరి.. వచ్చేసింది



మణుగూరు డిపోకు వచ్చిన లహరి బస్సుల వద్ద ఆర్టీసీ సిబ్బంది

- ఖమ్మం రీజియన్‌కు ఆరు స్లీపర్ బస్సులు
- మణుగూరుకు 4, సతుపల్లి డిపోకు 2 సర్వీసులు

చుంచుపల్లి: ఉమ్మడి జిల్లాలోని ఆర్టీసీ ప్రయాణికులకు లహరి స్లీపర్ బస్సులు అందుబాటులోకి వచ్చాయి. తాజాగా ఖమ్మం రీజియన్‌కు ఆరు లహరి నాన్ ఏసీ స్లీపర్ బస్సులను కేటాయించగా మణుగూరు డిపోకు నాలుగు, సత్తుపల్లి డిపోకు రెండు బస్సులు అప్పగించారు. ఆదివారం మణుగూరు డిపో పరిధిలో రెండు లహరి బస్సులను అధికారులు ప్రారంభించారు. వీటిని హైదరాబాద్‌కు రాత్రి వేళల్లో తిప్పేందుకు ఆర్టీసీ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. తొలి సర్వీసు ఆదివారం రాత్రి 9 గంటలకు మణుగూరు నుంచి హైదరాబాద్‌కు నడిపారు. అయితే మణుగూరు డిపోకు కేటాయించిన నాలుగు లహరి స్లీపర్ బస్సుల్లో రెండింటిని భద్రాచలం డిపోకు అప్పగించేలా చర్యలు తీసుకుంటున్నారు. సత్తుపల్లి డిపోకు వచ్చిన రెండు లహరి బస్సులను కూడా సోమవారం ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ప్రైవేట్ బస్సులకు దీటుగా అత్యాధునిక టెక్నాలజీతో రూపొందించిన ఆరు బస్సులు నిత్యం హైదరాబాద్‌కు రాకపోకలు సాగించనున్నాయి.

లహరితో సుఖ ప్రయాణం



సుదూర ప్రాంతాలకు బస్సులో కూర్చుని వెళ్లాలంటే ఇబ్బంది పడాల్సి వస్తోంది. ముఖ్యంగా హైదరాబాద్‌కు రాత్రి వేళల్లో వెళ్లాలంటే నరకమే. ఆర్టీసీలో స్లీపర్ బస్సులు లేకపోవడంతో ప్రైవేట్ సర్వీసులను ఆశ్రయించాల్సి వస్తోంది. అవి కూడా కొత్తగూడెం నుంచి తగిన సంఖ్యలో లేవు. ఆర్టీసీలో లహరి స్లీపర్ నాన్ ఏసీ బస్సులు ప్రవేశ పెట్టడం శుభ పరిణామం.

– సకినాల వెంకటేశ్వరరావు, కొత్తగూడెం

ఆకట్టుకుంటున్న స్లీపర్ బస్సు..

టీఎస్ఆర్టీసీ ఆధ్వర్యంలో గత ఏడాది రోడ్డెక్కిన లహరి బస్సులు జిల్లాకు రానే వచ్చాయి. గత సంవత్సరం బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రారంభించిన లహరి ఏసీ– నాన్ ఏసీ బస్సులను అప్పట్లో ఖమ్మం రీజియన్‌కు కొన్ని కేటాయిస్తారని ప్రయాణికులు ఆశగా ఎదురుచూశారు. కానీ నిరాశే మిగిలింది. ఇటీవల మరికొన్ని స్లీపర్ బస్సులను ప్రభుత్వం కేటాయించగా ఉమ్మడి జిల్లాకు ఆరు బస్సులు వచ్చాయి. ఈ బస్సుల్లో అత్యాధునిక వసతులు అందుబాటులో ఉన్నాయి. లోయర్ 33 సీటింగ్, అప్పర్‌లో 15 బెర్తుల సామర్థ్యం ఉంటుంది. ప్రయాణికులకు ఉచిత వైఫై సదుపాయం, వాటర్ బాటిల్ పెట్టుకునేలా, మొబైల్ చార్జింగ్, ప్రతీ బెర్త్ వద్ద రీడింగ్ ల్యాంప్‌లు ఉంటాయి. వెహికల్ ట్రాకింగ్ సిస్టంతో పాటు పానిక్ బటన్ సదుపాయం కల్పించారు. కేబిన్, బస్సులోపల రెండు సీసీ కెమెరాలు అమర్చారు. బస్సు రివర్స్ చేసేందుకు వీలుగా రివర్స్ పార్కింగ్ అసిస్టెన్స్ కెమెరా ఉంటుంది. బస్సుకు ముందు వెనుక ఎస్ఈడీ బోర్డులు, అత్యాధునిక ఫైర్ డిటెక్షన్ అండ్ అలారం సిస్టం ఉంటాయి. బస్సులో మంటలు చెలరేగితే ప్రయాణికులను ఇది అప్రమత్తం చేస్తుంది. రాజధాని, లగ్జరీ బస్సుల కంటే ఇందులో చార్జీ కూడా ఎక్కువే. మణుగూరు నుంచి హైదరాబాద్ బీహెచ్ఈఎల్‌కు రిజర్వేషన్‌తో కలిపితే స్లీపర్ రూ.800, సీటింగ్ రూ.670, కొత్తగూడెం నుంచి స్లీపర్ రూ. 680, సీటింగ్ రూ.570 చొప్పున వసూలు చేస్తున్నారు. అలాగే సత్తుపల్లి నుంచి హైదరాబాద్‌కు స్లీపర్ రూ.720, సీటింగ్ రూ.610, సత్తుపల్లి నుంచి బీహెచ్ఈఎల్ వరకు స్లీపర్ రూ.720, సీటింగ్ రూ.650 చార్జీగా నిర్ణయించారు. ఖమ్మం నుంచి హైదరాబాద్‌కు స్లీపర్ రూ.480, సీటింగ్ రూ.410, ఖమ్మం నుంచి బీహెచ్ఈఎల్‌కు స్లీపర్ రూ.520, సీటింగ్ చార్జ్ రూ.440 ఉంటుంది. ఇక రీజియన్‌లోనే అతి పెద్ద డిపో అయిన ఖమ్మంకు త్వరలో నాలుగు లహరి స్లీపర్ నాన్ ఏసీ బస్సులు వచ్చే అవకాశం ఉందని ఆర్.ఎం.సీహెచ్ వెంకన్న తెలిపారు.

జీవన విధానంలో మార్పుల వల్లే కేన్సర్

ఆంకాలజీ వైద్య నిపుణులు రవిశంకర్

సత్తుపల్లిటౌన్: ఆరోగ్యకరమైన జీవన విధానం అలవర్చుకోవడం ద్వారా కేన్సర్ వ్యాధి నుంచి కాపాడుకోవచ్చని హైదరాబాద్ బసవతారకం ఇండో అమెరికన్ కేన్సర్ ఆస్పత్రి ఆంకాలజీ వైద్య నిపుణులు డాక్టర్ రవిశంకర్ అన్నారు. స్థానిక జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో లయన్స్‌క్లబ్, చేతన ఫౌండేషన్ ఆధ్వర్యాన ఆదివారం కేన్సర్ నిర్ధారణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానసిక ఒత్తిడి, ఆహారంలో కాలుష్యం, గుట్కా, పాన్ మసాలాలు కేన్సర్‌కు దారి తీస్తున్నాయని తెలిపారు. మానవుని జీవన విధానంలో వస్తున్న అనేక మార్పులు కేన్సర్‌కు కారణమవుతున్నాయని చెప్పారు. సత్తుపల్లిలో రెండురోజుల పాటు 400 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా, ముగ్గురిలోనే కేన్సర్ ప్రాథమిక లక్షణాలు ఉన్నాయని గుర్తించామని తెలిపారు. శిబిరాన్ని జిల్లా కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, వైస్ చైర్మన్ తోట సుజలరాణి సందర్శించారు. కార్యక్రమంలో చేతన ఫౌండేషన్ నిర్వాహకులు పసుమర్తి రంగారావు, లయన్స్‌క్లబ్ నిర్వాహకులు దొడ్డా కృష్ణయ్య, పెనుగొండ రమేష్, గుండు శ్రీనివాసరావు, గంధ్ర సోమిరెడ్డి, మందపాటి ప్రభాకర్‌రెడ్డి, సత్యనారాయణ, మామిళ్లపల్లి హరిబాబు, జయ, రమణ, ఉమామహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.



కేన్సర్ నిర్ధారణ పరీక్ష చేస్తున్న డాక్టర్ రవిశంకర్